సాక్షి సిద్దిపేట

శనివారం । 28 । డిసెంబర్ । 2024



కుష్ఠు తగ్గుముఖం

కుష్ఠు వ్యాధి క్రమంగా తగ్గుతూ వస్తోంది. పదేళ్లతో పోలిస్తే కేసుల సంఖ్య గణనీయంగా తగ్గాయి. వివరాలు 10లో ▸



రోడ్లపైనే మార్కెట్లు..

హుస్నాబాద్‌లో రోడ్లపైనే మార్కెట్లు నిర్వహిస్తున్నారు. సమీకృత భవనం అర్ధంతరంగా నిలిచిపోవడమే కారణం. వివరాలు 10లో ▸




'గట్టు' పంచాయితీలు..

సర్వేయర్లు భూముల కొలతలు చేపట్టకపోవడంతో 'గట్టు' పంచాయితీలు ఎక్కువయ్యాయి. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నాచగిరీశుడికి లక్ష పుష్పార్చన



వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహునికి భక్తజన సామూహిక లక్షపుష్పార్చన నేత్రపర్వం చేసింది. ధనుర్మాస వేళ విశేషమైన ద్వాదశిరోజు శుక్రవారం స్వామివారి నామస్మరణ, పూజాది కార్యక్రమాలతో నాచగిరిలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అర్చక, బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలు ఓవైపు, స్వామివారి నామాలు పఠిస్తూ భక్తజనులు సామూహికంగా పూలను భక్తిశ్రద్ధలతో స్తంభోద్భవుడికి అర్పించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో భక్తిభావనలు ఉప్పొంగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మామిడాల రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా దేవసాని వాసుదేవ్, కోశాధికారిగా రచ్చ రమేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా నరసింహులు, ఉపాధ్యక్షులుగా లగిశెట్టి రాజు, పి.రాజు, సత్యనారాయణ, స్వామి, కుమార్‌లతో పాటుగా జాయింట్ సెక్రటరీలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రైతు కూలీలకు ఇచ్చిన హామీ ఏమాయె..

- సీఎంకు డీబీఎఫ్ బహిరంగ లేఖ



సీఎంకు లేఖలు రాస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్: రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందజేసే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖలు రాసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏగొండస్వామి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ డిక్లరేషన్‌లో రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను సైతం స్వీకరించారని చెప్పారు. అంతేకాకుండా బడ్జెట్‌లో రూ.1200కోట్లను కేటాయించారని తెలిపారు. ఈ హామీని వెంటనే కార్యరూపంలోకి తేవాలని సీఎంకు బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం మొండి వైఖరి వీడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 18వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలపై నేటికీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపాలన్నారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి కర్నాకర్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

నెత్తుటి దారులు.. పెరిగిన నేరాలు

ఈ ఏడాది ఐదు శాతం క్రైమ్ రేట్ అధికం

- 2024లో 6,233 కేసులు.. 2023లో 5,931..
- పెరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య
- అలాగే పోక్సో, హత్యలు, గంజాయి కేసులు సైతం..
- రికవరీ తక్కువ.. దొంగతనాలు ఎక్కువ

జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైం రేటు 5శాతం పెరిగింది. 2023లో 5,931 కేసులు నమోదైతే ఈ ఏడాది 6,233 కేసులు నమోదయ్యాయి. పోక్సో, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, గంజాయి కేసులు సైతం ఎక్కువగానే చోటుచేసుకున్నాయి. సైబర్ క్రైం, మోటారు యాక్ట్ కేసులు తక్కువగా జరిగాయి. సీఈఐఆర్ నూతన పరిజ్ఞానంతో పోగొట్టుకున్న 1,369 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఈ ఏడాది వివిధ కేసుల్లో నేరస్తులకు 48 శాతం శిక్షలు పడ్డాయి. గత ఏడాది పలు కేసుల్లో 47శాతం శిక్షలు విధించారు. లోక్ అదాలత్ ద్వారా భారీగా కేసులను పరిష్కరించేందుకు కృషి చేశారు.

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాలు పెరగడంతో పాటు మరణాల సంఖ్య సైతం పెరిగింది. ఈ ఏడాది 655 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 283 మంది మృత్యువాత పడ్డారు. 561 మందికి గాయాలయ్యాయి. గతేడాది 540 కేసులు నమోదు కాగా 260 మంది మృతి చెందారు. 480 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 12,681 కేసులు నమోదయ్యాయి. అందులో 45 మందికి జైలు శిక్ష పడింది. 2023లో 9,713 కేసులు నమోదు కాగా 28 మందికి జైలు శిక్ష విధించారు.

దొంగతనాలు ఎక్కువ..

జిల్లాలో దొంగతనాలు పెరిగాయి, సొత్తు రికవరీ తక్కువగా నమోదైంది. ఈ ఏడాది 709 దొంగతనాలు జరిగాయి. ఇందులో రూ.31,097,968 చోరి కాగా 40శాతమే రికవరీ చేశారు. గతేడాది 670 కేసులు నమోదు కాగా రూ. 37,385,833 చోరి జరిగింది. వీటిలో 43శాతం సొత్తును రికవరీ చేశారు. ఈ సంవత్సరంలో 9 చైన్ స్నాచింగ్‌లు జరగాయి. 2023లో అయిదు చోట్ల చోటుచేసుకున్నాయి.

- ఈ ఏడాది 91 పోక్సో కేసులు, గతేడాది 89 కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఈ ఏడాది 75 రేప్ కేసులు, గతేడాది 73 కేసులు నమోదయ్యాయి.
- ఈ ఏడాది 25 హత్య కేసులు చోటుచేసుకోగా, గతేడాది 13 జరిగాయి.

స్పీడ్ తగ్గింది..

- రోడ్డు ప్రమాదాల నివారణకు రాజీవ్ రహదారిపై అతి వేగంగా వెళ్లే వాహనాలపై స్పీడ్ లేజర్ గన్ ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. స్పీడ్ లిమిట్‌లో వాహనాలు నడపడంతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తక్కువ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 43,594 కేసులు నమోదు చేసి రూ.4,50,76,390 జరిమానా విధించారు. 2023లో 86,533 కేసులు నమోదు చేసి రూ. 8,95,27,414 జరిమానా వేశారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై ఈ ఏడాది 3,45,816 కేసులు నమోదు చేశారు. 2023లో 4,89,016 కేసులు నమోదయ్యాయి.

తగ్గిన సైబర్ కేసులు

- జిల్లాలో ఈ ఏడాది 199 సైబర్ కేసులు నమోదు కాగా బాధితులకు సంబంధించిన రూ.69,61,586 ఫ్రీజ్ చేశారు. గతేడాది 234 కేసులు నమోదు అయ్యాయి. సైబర్ నేరాల గురించి పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నేరాలు తగ్గుతున్నప్పటికీ ఆగడం లేదు.
- ఈఏడాది 80 మందిపై పేకాట కేసులు నమోదు కాగా, గతేడాది 26 కేసులు చోటుచేసుకున్నాయి.



సిద్దిపేటలో ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన తండ్రి (ఫైల్)

- ఈ ఏడాదిలో నకిలీ, కల్తీ విత్తనాలపై 3 కేసులు నమోదు కాగా, గతేడాది ఒక కేసు నమోదైంది.

40 గంజాయి కేసులు నమోదు



ఈ ఏడాది 40 గంజాయి కేసులు నమోదైతే.. గతేడాది 14 కేసులు నమోదు అయ్యాయి. చేర్యాల పట్టణ కేంద్రంలో ఓ పాన్ షాప్‌లో ఎక్సైజ్ అధికారులు నవంబర్ నెలలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన 6 కిలోల (1200 గంజాయి చాక్లెట్లు) గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాల ఘటనలు కొన్ని..

- జనవరి 10న సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి లోకేష్, వంశీ ఇద్దరు యువకులు దుర్మరణం.
- ఫిబ్రవరి 28న నంగునూరు మండలం రాంపూర్ క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.
- జూన్ 11న సిద్దిపేట పట్టణంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి గిరీశ్ అనే యువకుడు ప్రమాదవశాత్తు మృతి.
- ఆగస్టు 12న రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద డీసీఎం అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో మాచీన్‌పల్లికి చెందిన వంశీ, నవీన్, రాకేష్ ముగ్గురు యువకులు మృతి చెందారు.
- సెప్టెంబర్ 3న దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ వద్ద కుటుంబ కలహాలతో అన్నా చెల్లెళ్లు ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- నవంబర్ 9న హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళుతుండగా బెజ్జంకి మండల కేంద్రంలో కారు అదుపుతప్పి కల్వర్టు ఢీకొన్న ఘటనలో తల్లికూతుళ్లు మృతి చెందారు.
- నవంబర్ 10న తమ్ముడు కొట్టాడని తీవ్ర మనస్తాపానికి గురై సిద్దిపేట పట్టణానికి చెందిన తేలు సత్యం (48), తన కుమారుడు అద్వేష్‌నంద (8), కూతురు త్రివేణి హాసిని (6)తో సహా స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీం, భరోసా, సఖి, స్నేహిత మహిళ సపోర్టు సెంటర్ ద్వారా పలు రకాల కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ అనురాధ, సీపీ, సిద్దిపేట

బకాయి వేతనాలు చెల్లించండి



గజ్వేల్‌లో గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన ర్యాలీ

గజ్వేల్‌రూరల్: గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వారి సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. జీపీ కార్మికులు సకాలంలో వేతనాలు రాకపోవడంతో చాలీచాలని వేతనాలతో అప్పులు చేసి తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, నెలలు గడుస్తున్నా బకాయి వేతనాలు చెల్లించకపోవడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో సమ్మెను చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు వెంకటచారి, జీపీ యూనియన్ నాయకులు యాదగిరి, నర్సింలు, కనకయ్య, ఎల్లం, నాగరాజు, బాబు, ఎల్లమ్మ, లక్ష్మీ, యాదమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఠాణాలో 'విశ్రాంతి గది'



నారాయణఖేడ్: నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మహిళా విశ్రాంతి గదిని డీఎస్పీ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బంది కూర్చోవడానికి, సేదతీరడానికి ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు ఈ గదిని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళా కానిస్టేబుళ్లు కొత్తగా రావడం వల్ల ఏర్పాటు చేశామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీశైలం, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మా టీచర్లు మాకు కావాలి..

కేజీబీవీ ఎదుట విద్యార్థినుల నిరసన

చేర్యాల(సిద్దిపేట): 'మాకు ఇన్ని రోజులు పాఠాలు బోధించిన టీచర్లే కావాలి. వేరే వారు వద్దు' అని చేర్యాల కేజీబీవీ విద్యార్థినులు శుక్రవారం హాస్టల్ భవనం బయటకు వచ్చి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ కిష్టయ్య వెంటనే అక్కడకు వెళ్లి వారికి సర్ది చెప్పి లోపలికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు గతంలో కేజీబీవీ ఎస్‌ఓగా విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని ఇన్‌చార్జి ఎస్‌ఓగా నియమించినట్లు తెలిపారు. ఆమె శుక్రవారం హాస్టల్‌కి వచ్చిన సందర్భంగా విద్యార్థినులు తమకు గతంలో ఉన్న టీచర్లే కావాలని వేరే ఎవరూ వద్దంటూ హాస్టల్ బయటకు వచ్చి నిరసనకు దిగారని, వారిని సముదాయించి సమస్య సద్దుమణిగేలా చేసినట్లు తెలిపారు.



హాస్టల్ భవనం బయట విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ కిష్టయ్య

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయండి

- హమాలీ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేటఅర్బన్: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐకేపీలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వమే రేటు నిర్ణయించి కూలీ చెల్లించాలని, సుతిలీ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షలు, సహజ మరణం చెందిన వారికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. హమాలీ కార్మికుల పిల్లల చదువులకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో హమాలీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ నెల 30వ తేదీన చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కనకయ్య, ఎల్లయ్య, భిక్షపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలస్వామి

డ్యాం పటిష్టతపై నిపుణుల ఆరా



డ్యాం రాతి కట్టను పరిశీలిస్తున్న సేఫ్టీ బృందం

- సింగూరును పరిశీలించిన సేఫ్టీ బృందం
- మట్టి కట్ట, రాతి కట్ట, సీపింగ్ గ్యాలరీ పరిశీలన
- డ్యాం భద్రతపై సంతృప్తి

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టును శుక్రవారం డ్యాం సేఫ్టీ ఇంజినీర్ల బృందం సందర్శించింది. భూగర్భనిపుణుడు ఎం.రాజు, డ్యాం రక్షణ నిపుణుడు విజయ్ ట్రింబక్ దేశాయ్ నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం నిశితంగా పరిశీలించింది. జాతీయ డ్యాం సేఫ్టీ కమిటీ సూచనల మేరకు ఈ బృందం ప్రతి రెండేళ్లకోసారి నీటి పారుదల శాఖ ప్రాజెక్టులను పరిశీలించి నివేదికలు సమర్పిస్తుంది. ఉదయం ప్రాజెక్టుకు చేరుకున్న బృందం అణువణువును డ్యాంను పరిశీలించారు. వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక ఇంజినీర్ల నుంచి వివరాలు సేకరించారు. డ్యాం కుడి, ఎడమల మట్టి కట్టను, డ్యాంపై ఉన్న 17 గేట్లను పరిశీలించారు. గేట్లను ఎత్తే వైర్‌రూప్‌లను, మట్టి కట్ట పటిష్టతను, మట్టి కట్టపై నిర్మించిన రాతి కట్టడాలను పరిశీలించారు. గేట్లను ఎత్తడానికి ఉపయోగించి విద్యుత్ మోటార్ల పనితీరుపై ఆరా తీశారు. దిగువ భాగంలో సీపింగ్ వాటర్ పోవడానికి నిర్మించిన గ్యాలరీని పరిశీలించారు.

సేఫ్టీ బృందం నివేదికపైనే..

సింగూరు డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 30టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 29 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో అధికారులు డ్యాం రక్షణపై పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. డ్యాం సేఫ్టీ అధికారుల నివేదికల ప్రకారం మరమ్మతులు చేపడుతారు. గత వేసవిలో సింగూరు ప్రాజెక్టుకు గేట్లను ఎత్తడానికి ఉపయోగించి రూప్‌వైర్లను మార్చి గ్రీజ్ చేయించారు. గేట్లను అమర్చే గ్రూపులలో రబ్బర్లను అమర్చి లీకేజీలను అరికట్టారు. ఈ బృందంలో నీటి పారుదల శాఖ సీఈలు ధర్మా, మోహన్‌కుమార్, ప్రమీల, యేసయ్య ఈఈ బీం, డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక స్వేచ్ఛకు ఆద్యుడు

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం
- ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన మహామేధావి
- ఆయన హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం
- ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల నాయకులు సంతాపం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు, చట్టాలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. దేశం ఆర్థికంగా దివాళా అంచున ఉన్న సమయంలో నాటి ప్రధాని పీవీ నర్సింహారావు క్యాబినెట్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశ ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టారన్నారు. 2004–2014 వరకు దేశ ప్రధానిగా ఎన్నో సేవలు అందించారన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ కార్యక్రమాన్ని చేపట్టి, పేద ప్రజల ఆర్థిక స్వావలంబన కల్పించారన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షుడు ముద్దం లక్ష్మి, కలీమొద్దీన్, మంద పాండు, మార్క సతీష్, షాబొద్దీన్, వాహబ్, అజ్మత్, కవిత, స్రవంతి, కవిత, పద్మ, స్నేహ, బుచ్చి రెడ్డి, అంజయ్య, భిక్షపతి, అంజిరెడ్డి, మల్లారెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో సాఫ్ట్‌బాల్‌లో మెరిసిన కార్తీక


కప్‌తో కార్తీక

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయం సాధించిన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ తండాకు చెందిన ధరావత్ కార్తీక పలువురి ప్రశంసలు అందుకుంటుంది. తూప్రాన్‌లోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కార్తీక స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ 37వ జాతీయ చాంపియన్ పోటీల్లో తెలంగాణ సాఫ్ట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందడంతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ రఘునందన్‌రావు అభినందించారు. అలాగే తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు.

సైబర్ మోసగాడి వలలో కాలేజీ విద్యార్థి

నర్సాపూర్: సైబర్ మోసగాళ్లు పంపిన వాట్సాప్ మేసేజ్ వలలో ఓ విద్యార్థి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతున్న బాలయోగి గత నెలలో వాట్సాప్ మేసేజ్‌లో వచ్చిన లింకును ఓపెన్ చేశాడు. కొంత డబ్బు పంపాలని, రేటింగ్ ప్రకారం తిరిగి డబ్బులు పంపుతామని మేసేజ్ ఉండడంతో పలుమార్లు రూ.28,500 పంపించాడు. చివరకు డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయానని బాలయోగి గుర్తించి సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేయగా కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని ఎస్‌ఐ ప్రజలకు సూచించారు.

వ్యాయామ విద్యలో డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న యాదగిరి

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన యాదగిరి డాక్టరేట్ పట్టా పొందాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రిటైర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ పీ.వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పట్టా తీసుకున్నాడు. ఏ స్టడీ ఆఫ్ హెల్త్ రిలేటెడ్ ఫిజికల్ ఫిట్‌నెస్ అమాంగ్ గురుకుల స్కూల్ స్టూడెంట్స్ ఇన్ మెదక్ జిల్లా (తెలంగాణ) అనే అంశం మీద ఆరేళ్లుగా పరిశోధన చేశారు. మలిదశ ఉద్యమంలో నిజాం కాలేజీ నుంచి ఓయూ జేఏసీ నేతగా పోరాడి తెలంగాణ రాష్ట్రం సిద్ధించేలా తన వంతు పాత్ర పోషించారు.

నూతన కార్యవర్గం నియామకం


సన్మానంలో సభ్యులు

తూప్రాన్: హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కొంపల్లి సత్యనారాయణ తెలిపారు. మెదక్ జిల్లా అధ్యక్షుడిగా సాప ఆనంద్ కుమార్, ఉప అధ్యక్షుడిగా వెంకట్ యాదవ్‌ను నియమించారన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శుక్రవారం జాతీయ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొడక్షన్ సర్వీస్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.21,500 జరిమాన విధించినట్లు తెలిపారు.

కుష్ఠు తగ్గుముఖం

- జిల్లాలో పక్షం రోజులు సర్వే
- 138 మంది అనుమానితుల్లో 10 మందిని గుర్తింపు
- గతేడాది 16 మంది బాధితులు
- పదేళ్లతో పోలిస్తే భారీగా తగ్గిన సంఖ్య
- సర్వేలో పాల్గొన్న 934 మంది ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది
- ఉచితంగానే చికిత్స అందజేత

చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్న కుష్ఠు వ్యాధి క్రమంగా తగ్గుతూ వస్తోంది. పదేళ్ల కిందట 200 వరకు ఉండే రోగుల సంఖ్య నేడు గణనీయంగా పడిపోయింది. తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం, పౌష్టికాహారం భుజించడం, తక్షణ వైద్య సేవలు పొందడం, జిల్లా వైద్యశాఖ కుష్ఠు నివారణపై ఉక్కు పాదం మోపడం కారణంగా జిల్లాలో రోగుల సంఖ్య తగ్గేలా చేసింది. 2వ తేదీ నుంచి 15 వరకు జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వే నిర్వహిస్తూ రోగులను గుర్తించి చికిత్సలు అందజేస్తుంది.

– నారాయణఖేడ్


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా 1,70,129 మందికి పరీక్షలు నిర్వహించి ఇందులో 138 మందిని అనుమానితులుగా గుర్తించి పరీక్షలు నిర్వహించగా అందులో 10 మంది వ్యాధిగ్రస్తులుగా తేలారు. 4 కేసులు సర్వే ద్వారా గుర్తించగా ఆరుగురు స్వచ్ఛందంగా సర్వే సిబ్బందికి వివరాలు అందజేశారు. గతేడాది 16,18,0224 జనాభాకు గాను 14,80,938 మందికి సర్వే నిర్వహించారు. అప్పుడు 1,815 మందిని అనుమానితులుగా నిర్ధారించి పరీక్షలు చేయగా అందులో 16 మంది వ్యాధిగ్రస్తులుగా గుర్తించారు. 11 మందిని సర్వే ద్వారా గుర్తించగా ఐదుగురు స్వచ్ఛందంగా సర్వే సిబ్బంది వద్దకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా మొత్తంలో 934 మంది ఆశా కార్యకర్తలు, ఆయా ప్రాంత వైద్య సిబ్బందికి కలిసి సర్వే నిర్వహించారు.

అంటువ్యాధి కాదు

కుష్ఠు వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. చర్మ, నరాలకు సోకే వ్యాధి చాలా నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు 5 ఏళ్లలోపు బయట పడుతాయి. వయస్సు, లింగ బేధం లేకుండా ఎవరికైనా సోకే ప్రమాదం ఉంది. వంశ పారంపర్యంగా, పాపం వల్ల సోకడం అనేది అపోహమాత్రమే. ఈ వ్యాధి బహుల ఔషధ చికిత్సలో 6 నెలల నుంచి 12 నెలల్లోపు పూర్తిగా నయం అవుతుంది. కుష్ఠు వ్యాధిగ్రస్తులు సామాజిక జీవనం గడపవచ్చు.

శరీరంలో ఎక్కడైనా వచ్చే అవకాశం

ప్రారంభ దశలో గుర్తించి ఎండీటీ చికిత్స అందజేసిన పక్షంలో కుష్ఠువ్యాధి అంగవైకల్యానికి దారి తీయదు. చికిత్స పూర్తయిన, చికిత్స పొందుతున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేసే అవకాశం ఉంది. కుష్ఠువ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా రాగి రంగు కలిగి ఉండి మచ్చలపై స్పర్శ ఉండదు. దేహంలో ఏ ప్రదేశంలోనైనా వచ్చే అవకాశం ఉంది. నరాలకు వ్యాధి సోకితే కాళ్లు లేక చేతుల్లో తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ కోల్పోవడం లక్షణాలు కన్పిస్తాయి. చికిత్స 1 నుంచి 5 మచ్చలు ఉన్న వారికి 6 నెలలు, 6 కంటే ఎక్కువ మచ్చలు ఉన్న వారికి 12 నెలలు కాలం చికిత్స ఉంటుంది. చర్మంపై ఏ రకం మచ్చలు ఉన్నా దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యులను, సమీపంలోని ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలి.

అందని సర్వే డబ్బులు..

ఆశా కార్యకర్తల ద్వారా సర్వే నిర్వహించగా రెండేళ్లుగా వారికి సర్వేకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం చెల్లించలేదు. ఈ ఏడాది కూడా సర్వే చేయాలని వైద్యశాఖ ఒత్తిడి మేరకు చేసేది లేక సర్వే నిర్వహించారు. సర్వేపై ఆశా కార్యకర్తలు మొదట్లో విముఖత చూసినా వైద్య సిబ్బంది ఒత్తిడి, కార్యక్రమం విజయవంతం చేయాలనే ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. ఇప్పటికైనా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

ఉచితంగానే వైద్యం



జిల్లా వ్యాప్తంగా పక్షం రోజులు సర్వే నిర్వహించి 138 మందిని అనుమానించి 10 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించాం. గతం కంటే జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. సకాలంలో చికిత్సలు అందడం, వైద్య జాగ్రత్తలు తీసుకోవడంతో రోగులు తగ్గారు. పదేళ్ల కిందట రోగుల సంఖ్య విపరీతంగా ఉండేది. అనుమానితులు సమీప ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే చికిత్సలు చేయడం జరుగుతుంది.

– కె.మారుతీ, డిప్యూటీ పారామెడికల్ అధికారి, సంగారెడ్డి

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- మూడు తులాల బంగారం, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విద్యాసాగర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా పెనుమల్లి మండలానికి చెందిన తూర్పాటి ప్రసాద్ హైదరాబాద్ అల్వాల సూర్య నగర్ కాలనీలో నివాసం ఉంటూ దొంగతనాలకు అలవాటు పడ్డాడు. నవంబర్ 11న సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేంద్ర నగర్ హనుమాన్ దేవాలయంలో హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లాడు. అదే రోజు సందీప్‌నగర్‌లో ఓ ఇంటి తాళం పగులగొట్టి రూ.90,000 విలువ గల బంగారు వస్తువులను దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి సీసీ కెమెరాల సాయంతో నిందితుడి కదలికలపై నిఘా పెట్టాం. నిందితుడు రంగధాంపల్లి చౌరస్తా వద్ద ఉన్నాడనే నమ్మదగిన సమాచారంతో ఎస్‌ఐ తిరుపతిరెడ్డి సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం విచారించగా రెండు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.7,630 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలోనే పలు జిల్లా పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులు ఉండి పలుమార్లు జైలుకెళ్లినట్లు పేర్కొన్నారు. కేసులో కీలకపాత్ర వహించిన ఎస్‌ఐ తిరుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కె.బాబు లను సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ అభినందించారు.

కళాకారులు లేనిది ఉద్యమం లేదు


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, పక్కన నాయకులు

- గ్రామీణ జానపద కళాకారులను ప్రభుత్వం కాపాడుకోవాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: పని నుంచే పాట పుట్టిందనేది ఎంత నిజమో, కళాకారులు లేనిదే ఏ ఉద్యమం లేదనేది అంతే నిజమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని రాజ రాజేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో ఉత్తర తెలంగాణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చాడ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తర తెలంగాణ జిల్లాలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలకు చెందిన, గిరిజన సాంప్రదాయ నృత్య, బుర్రకథ, పౌరాణిక కళాకారులు, గ్రామీణ జానపద గాయని గాయకులు, సీనియర్ ఉత్తమ కళాకారులు 300 మందికి ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులను ప్రభుత్వం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, ప్రొఫెసర్ తిరుపతి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, జేఏసీ నాయకులు లక్ష్మారెడ్డి, మేకల వీరన్న యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


భాస్కర్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్):అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తునికిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంద్రుగు భాస్కర్(29) గ్రామంలోనే ఐదేళ్లుగా టెంట్‌హౌస్ నిర్వహించడంతోపాటు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది కాలంలో టెంట్‌హౌస్‌లో నష్టం రావడం, వ్యవసాయం కలిసిరాకపోవడంతో అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చేమార్గం లేక మదనపడుతుండేవాడు. గురువారం భార్య సరిత, ఇద్దరు కుమారులను రెండు రోజులు ఉండి రమ్మని అదే గ్రామంలోని పుట్టింటికి పంపించాడు. భాస్కర్ రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఉదయం తల్లి గదిని శుభ్రం చేసేందుకు తలుపు తీయమని పిలిచినా పలకకపోవడంతో ఇరుగు పొరుగువారి సాయంతో తలుపు తీసి చూసింది. ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు


మాట్లాడుతున్న రాంబాబు

సిద్దిపేటకమాన్: విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సామాజిక అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం నేడు పాలకుల ఆలోచనలతో ఆర్థిక సంక్షోభంతో సతమతం అవుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు కుంపటిలా మారాయన్నారు. 23, 34, 35వ తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో మూడు తీర్మానాలు ఆమోదించామని, వాటిని ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సమావేశంలో ఫణిందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మార్కెట్లు.. తప్పని ఇక్కట్లు

- హుస్నాబాద్‌లో అసంపూర్తిగా సమీకృత మార్కెట్ భవనం
- సకాలంలో రాని బిల్లులు
- మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- రహదారులపైనే వ్యాపారాలు
- ట్రాఫిక్ సమస్య, పోలీసుల ఆంక్షలు


రోడ్ల పైనే కూరగాయల విక్రయాలు


అసంపూర్తిగా మార్కెట్ భవనం

హుస్నాబాద్: సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవనానికి నిధుల గ్రహణం పట్టుకుంది. భవన పనులు నిలిచిపోవడంతో చిరు వ్యాపారులు రోడ్ల పైనే విక్రయాలు జరుపుతున్నారు. ఓ వైపు ట్రాఫిక్ సమస్య, మరో వైపు పోలీస్‌ల ఆంక్షలతో చిరు వ్యాపారులకు కష్టాలు తప్పడం లేదు. హుస్నాబాద్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వరకు అప్‌గ్రేడ్ అయినా నేటికి సమీకృత మార్కెట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో దాదాపు 35 వేలకు పైనే జనాభా ఉంది. కూరగాయలు కావాలంటే ఎక్కడకొనాలో తెలియక గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

రూ.1 కోటికి పైగానే ఆదాయం

హుస్నాబాద్ పట్టణంలో ప్రతీ శుక్రవారం జరిగే వారాంతపు సంత ద్వారా మున్సిపాలిటీకి రూ.1.20 కోట్లు ఆదాయం సమకూరుతుంది. ప్రతీ కూరగాయల దుకాణానికి రూ.50 నుంచి రూ.100 వరకు సంబంధిత కాంట్రాక్టర్ వసూలు చేస్తున్నాడు. కానీ సంతలో సరైన సౌకర్యాలు లేవు. రోడ్ల పైన కాకుండా ఒకే చోట సమీకృత మార్కెట్ భవనం అందుబాటులోకి వస్తే ఇటు వ్యాపారులకు, అటు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అలాగే కూరగాయలతోపాటు మాంసం, చేపలు అమ్మడానికి మార్కెట్ లేక రోడ్లపైనే విక్రయాలు జరుపుతున్నారు. గతంలో అమ్ముకునే స్థలంలో పోలీస్ కాంప్లెక్స్ భవనం నిర్మించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత రెవెన్యూ డివిజన్ కార్యాలయ స్థలంలో విక్రయాలు జరుపుతున్నారు.

బిల్లులు రాకపోవడంతోనే..

గత ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ కార్యాలయం స్థానంలో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన నిర్మాణానికి రూ.2.75 కోట్లు మంజూరు చేసింది. గతంలో ఫిబ్రవరి 2022లో అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ కేవలం పిల్లర్ల వరకే నిర్మించి వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల కొరత ఏర్పడటంతో మార్కెట్ భవనం నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

మంత్రి దృష్టికి తీసుకెళ్తా..

సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయింది వాస్తవమే. భవన నిర్మాణ పనులు సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో జాప్యం జరుగుతోంది. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనుల విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తాం.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్, హుస్నాబాద్

నడక నేర్పిన ఆరోగ్యం

- జోగిపేటలో పెరుగుతున్న వాకర్స్
- కిటకిటలాడుతున్న క్రీడా మైదానాలు
- రోగాలు దరిచేరవంటున్న వైద్యులు
- శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్య సమస్యలు
- మారుతున్న జీవనశైలితో ఆరోగ్యంపై దృష్టి


జోగిపేట క్రీడా మైదానంలో వాకర్స్



జోగిపేట(అందోల్): మానసిక ఆందోళన, ఒత్తిడి వంటి వాటితో మనిషి జీవితాలు తలకిందులవుతున్నాయి. మారుతున్న జీవన శైలితో కారణంగా షుగర్, బీపీ, ఉబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. అంతే కాకుండా టెక్నాలజీ పెరిగిన కారణంగా మనుషుల శారీరక శ్రమ తగ్గడంతో అనేక రోగాల బారిన పడుతున్నారు. దానికి ఒకే ఒక్క మార్గం నడక. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్యనిపుణులు చెబుతున్నారు. దీంతో రోగాలు దరిచేరవని సూచిస్తున్నారు.

రోజుకు రెండుసార్లు వాకింగ్..

ఉదయం నడక, సూర్యరశ్మితో ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పట్టణ వాసులు సూర్యుడు ఉదయించక ముందే క్రీడా ప్రాంగణాలు, ఖాళీ మైదానాలు, గ్రామాల్లో ఊరి పొలిమేరలో నడుస్తున్నారు. ఉదయం వేళ కుదరని వారు మాత్రం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాకింగ్‌కు సమయాన్ని కేటాయిస్తున్నారు. కొడంగల్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, అందోల్ పెద్ద చెరువు కట్ట, బైపాస్ రోడ్లను వాకింగ్‌కు వేదికగా ఎంచుకున్నారు. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు. పాఠశాలల మైదానాలే కాక జాతీయ రహదారి వెంబడి వాకర్స్ సంఖ్య పెరుగుతోంది.

రోగాలక్ చెక్..!

క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్ అనే హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు అంశాలను అధిగమించొచ్చు. గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరిచేరవు. గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేస్తాయి. అధిక రక్తపోటు, మధు మేహం, కొలస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది. శరీరంలోని అధిక కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది శరీరానికి మంచి శ్వాస, అధికస్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది. విటమిన్ డీ లోపం ఉండదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

రోజంతా హుషారుగా..



30 ఏళ్లు దాటిన వారంతా నడకను దినచర్యగా పెట్టుకోవాలి. నడక వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో గుండె సంబంధింత జబ్బులు దరిచేరవు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు ధృడంగా మారుతాయి. ప్రతి రోజూ ఉదయం 5.15 గంటల వరకు గ్రౌండ్‌కు చేరుకొని ఫ్రెండ్స్‌తో కలిసి హైస్కూల్ గ్రౌండ్‌లో 8 నుంచి 10 రౌండ్లు నడుస్తాం. తర్వాత వ్యాయామం చేస్తాం. రోజంతా హుషారుగా ఉంటుంది.

– విఠల్, జూనియర్ కళాశాల అధ్యాపకుడు

మానసిక ఒత్తిడి తగ్గుతుంది



రోజంతా వ్యాపారంలో తలమునకలై అలసిపోతాం. ఉదయమే లేచి వాకింగ్ చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గడంతోపాటు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలి. వాకింగ్ వల్ల బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావు, వాకింగ్ చేయని రోజు ఎంతో బద్ధకంగా ఉంటుంది. ఏ పని చేయాలపించదు. నేను వ్యాపారస్తుడను, ఉదయం నుంచి పని ఒత్తిడి ఉంటుంది. వాకింగ్ వల్ల పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను.

– యెదిరె రమేశ్ గుప్త, వ్యాపారస్తుడు

శారీరక శ్రమ ఉండాలి



శారీరక శ్రమ లేకపోవడంతో మనుషులు అనారోగ్యానికి గురవుతుంటారు. మారుతున్న జీవన శైలి కారణంగా షుగర్, బీపీ, ఉబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తుంటాయి. వ్యాపార, ఉద్యోగాల పరంగా ఒత్తిడిలకు గురి కావడం వల్ల వివిధ రకాల రోగాల బారిన పడే అవకాశం ఉంది. షుగర్, బీపీ, హార్ట్ పేషెంట్‌లు ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం వేళలో కనీసం 45 నిమిషాల పాటైనా వాకింగ్ చేయడం మంచిది.

– అద్దంకి వీరన్న, వైద్యుడు